క్లుప్తంగా

సన్మానం



దండు రమేశ్‌ను సన్మానిస్తున్న శ్రీకాంత్

మల్హర్: రాష్ట్ర జాతీయ ఉపాధిహామీ కౌన్సిల్ మెంబర్ దండు రమేశ్, కాటారం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల సమ్మయ్యలను గురువారం తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ యునైటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సాదుల శ్రీకాంత్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువాలతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ దోమల శ్రీనివాస్, కోశాధికారి తోలుపునూరి అశోక్, జిల్లా ఇన్‌చార్జ్ మెండ మల్లేశ్, కాటారం మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

గుడుంబా విక్రయిస్తే చర్యలు



తహసీల్దార్ ఎదుట మహిళను బైండోవర్ చేస్తున్న పోలీసులు

మల్హర్: గుడుంబా తయారు చేసిన, విక్రయించిన చర్యలు తప్పవని కొయ్యూరు ఎస్సై నరేశ్ హెచ్చరించారు. మండలంలోని గాదంపల్లి గ్రామంలో లక్ష్మి అనే మహిళ గుడుంబా తయారు చేసి, విక్రయిస్తుండగా పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఆమె వద్ద నుండి 15 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మహిళను తహసీల్దార్ రవికుమార్ ఎదుట బైండోవర్ చేసినట్లు చెప్పారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రులు

చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన దూదిపాల దేవేందర్‌రెడ్డి ఇటీవల మృతి చెందాడు. దీంతో అతడితో కలిసి చదువుకున్న 1998–99 పదో తరగతి బ్యాచ్‌కి చెందిన మిత్రులు గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మిత్రబృందం సభ్యులు ఉన్నారు.

గుంతల పూడ్చివేత



టేకుమట్ల: మండలంలోని రామకిష్టాపూర్(టి) శివారు, టేకులకుంట వద్ద గల లోలెవల్ కల్వర్టు కొన్ని ప్రమాదకరంగా మారింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగా, గురువారం ప్రయాణికుల సౌకర్యార్థం తహసీల్దార్ విజయలక్ష్మి లోలెవల్ కల్వర్టులోని గుంతలను పూడ్చివేపించారు.

జరిమానా

మొగుళ్లపల్లి: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్ల యజమానులకు జరిమానా విధించినట్లు తహసీల్దార్ సునీత గురువారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఇటీవల మండలంలోని పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న క్రమంలో ఎస్సై అశోక్ పట్టుకొని తహసీల్దార్ ఎదుట హాజరుపరిచారు. ఈనేపథ్యంలో ఆమె విచారణ చేసి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు నిర్ధారించి, నిందితులు చింతలపల్లి గ్రామానికి చెందిన బొచ్చు సురేష్, పోతుగల్ గ్రామానికి చెందిన ఓరుగంటి సమ్మయ్య, తిప్పనవేని కిరణ్‌కుమార్‌లకు ఒక్కొక్కరికి రూ.5000లు జరిమానా విధించారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ములుగు రూరల్: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన జిల్లాకేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. దేవగిరిపట్నం గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి ద్విచక్ర వాహనంపై పని నిమిత్తం కోర్టు వద్దకు వచ్చాడు. తిరిగి వస్తున్న క్రమంలో జాతీయ రహదారి డివైడర్ తొలగించిన వద్ద దాటే ప్రయత్నం చేస్తున్న క్రమంలో జంగాపల్లి నుంచి ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వస్తు ఢీకొట్టారు. సంఘటనలో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. సుబ్బారెడ్డికి తలకు బలమైన గాయం అయింది. దీంతో ముగ్గురు వ్యక్తులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వెదజల్లే పద్ధతితో లాభాలు

- తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి
- కూలీల కొరత అధిగమించొచ్చు



వరి విత్తనాలను వెదజల్లుతున్న రైతు

రేగొండ: తక్కువ ఖర్చుతో పాటు కూలీల కొరతను అధిగమించేందుకు వరిలో వెదజల్లే పద్ధతిని రైతులు పాటిస్తున్నారు. ఇందులో మొలకెత్తిన విత్తనాలను నేరుగా దమ్ము చేసిన పొలంలో వెదజల్లుతారు. దీంతో నారు పోసే, నాటు వేసే ఖర్చు ఆదా అవుతుంది. కూలీల కొరత సులువుగా అధిగమించవచ్చు. ఇప్పటికే మండలంలో ఈ సాగు విధానంపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. మండల వ్యాప్తంగా ఈ వానకాలంలో 20 వేల ఎకరాల్లో వరి సాగుచేస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా వెదజల్లే పద్ధతితో రెండు వేల నుంచి మూడు వేల వరకు సాగు కావొచ్చని అంచనా. కాగా, రైతులు ఈ సారి ఎక్కువగా 90 శాతం సన్న రకం వరి వైపే మొగ్గు చూపుతున్నారు.

ఎకరాకు రూ.10 వేల వరకు ఆదా..

సంప్రదాయ పద్ధతిలో నాటు విధానం ద్వారా విత్తనం ఖర్చు ఎక్కువవుతుండగా.. వెదజల్లే పద్ధతిలో ఎకరాకు 8–10 కిలోల విత్తనాలు సరిపోతాయి. వెదజల్లే పద్ధతిలో సాగు చేసిన పంట 7 నుంచి 10 రోజుల ముందుగానే కోతకు వస్తుంది. నారు పెంచడం నాట్లు వెయించే పనులు ఉండవు. ఈ లెక్కన కనీసం ఎకరాకు రూ.8 నుంచి రూ.10 వేల వరకు ఖర్చు రైతుకు ఆదా అవుతుంది. 10 నుంచి 15 శాతం దిగుబడి ఎక్కువ వస్తుంది. ఈ సాగు విధానానికి అన్ని రకాల నేలలు అనుకూలమే. వెదజల్లే ముందు విత్తనాలను 24 గంటలు మండె కట్టాలి. మొలకెత్తిన తర్వాత దమ్ము చేసిన పొలంలో వెదజల్లాలి.

కలుపు నివారణ యాజమాన్యం

కలుపు నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. విత్తిన 3 నుంచి 5 రోజుల మధ్యలో పైరజోసల్ఫ్యూరన్ ఇథైల్‌ను ఎకరాకు 80 నుంచి 100 గ్రాముల చొప్పున పొలంలో వెదజల్లుకోవాలి. 15 రోజుల తర్వాత ఎరువులు అందించాలి. ఒకవేళ అక్కడక్కడ కలుపు ఉంటే కూలీలతో తీయించాలి. వేర్లను తాకించడం వల్ల మొక్క ఏపుగా పెరుగుతుంది. అదేవిధంగా రెండు బస్తాల యూరియాతో పాటు నానో యూరియా 500 మిల్లీ లీటర్లను చల్లితే దిగుబడి అధికంగా వస్తుంది.

వెదజల్లే పద్ధతి బాగుంది



యాసంగిలో మూడు ఎకరాలలో వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేశాను. సాధారణ నాట్ల కంటే ఈ పద్ధతి చాలా సులువుగా ఉంది. నాకు ఎకరాకు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చు తగ్గింది. వెదజల్లే పద్ధతి ద్వారా పెట్టుబడి తగ్గి ఆదాయం పెరిగింది.

\- ఐరబోయిన దేవేందర్, రైతు, కొత్తపల్లిగోరి

అవగాహన కల్పిస్తున్నాం..



వరిలో వెదజల్లే పద్ధతి ద్వారా ఖర్చు ఆదాతో పాటు దిగుబడి సాధారణ సాగుతో పోలిస్తే ఎక్కువ వస్తుంది. రైతులు ఒకేసారి నాట్లు వేయడం వల్ల కూలీల కొరత వేధిస్తోంది. దీని వల్ల నాట్లు ఆలస్యమవుతున్నాయి. వెదజల్లే పద్ధతిలో తక్కువ విత్తనాలను అనుకున్న సమయంలో చల్లుకోవచ్చు. రైతులకు ఈ పద్ధతిపై అవగాహన కల్పిస్తున్నాం.

\- పెద్ది వాసుదేవరెడ్డి, ఏఓ, రేగొండ

ముందస్తు రాఖీ వేడుకలు



మల్హర్: రాఖీ కడుతున్న విద్యార్థినులు



మహదేవపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో..

మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని రామారావుపల్లి, ఎస్సీకాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో గురువారం ప్రధానోపాధ్యాయురాలు పద్మ ఆధ్వర్యంలో ముందస్తు రాఖీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాఖీ పౌర్ణమి పండుగ విశిష్టతను, అన్నాచెల్లెల అనుబంధం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ప్రధానోపాధ్యాయుడు అరుణ్ కుమార్, ఉపాధ్యాయురాలు కవిత, సురేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

టేకుమట్ల: ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రాఖీ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయంలోని ఉద్యోగులకు రాఖీలను కట్టి, మహిళా ఉద్యోగులతో ఆర్ఎస్ఎస్ నాయకులు రాఖీలు కట్టించుకున్నారు. నేరేళ్ల రామకృష్ణగౌడ్, రాజేశ్వర్‌రావు, గాజుల అజయ్, తదితరులు ఉన్నారు.

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి పట్టణంలో బీజేపీ పార్టీ మహిళా మోర్చా నాయకురాళ్లు వేశాల సత్యవతి, పద్మ, హైమావతి, శ్రావణి పోలీసులకు రాఖీ కట్టారు. పార్టీ జిల్లా నాయకులు దొంగల రాజేందర్, రామ్‌రెడ్డి, సుధాకర్, మాచర్ల రఘు, చెక్క శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఏబీవీపీ మండల శాఖ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. విభాగ్ ప్రచారక్ విఘ్నేష్, నగర కార్యదర్శి పేట సాయి, వినయ్, సాయిరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



టేకుమట్ల: ఆర్ఎస్ఎస్ కార్యకర్తకు రాఖీ కడుతున్న తహసీల్దార్ విజయలక్ష్మి



భూపాలపల్లి రూరల్: ట్రాఫిక్ పోలీసులకు రాఖీలు కడుతున్న మహిళా మోర్చా నాయకులు

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

- ట్రాన్స్‌కో ఏడీఈ నాగరాజు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న విద్యుత్ అధికారులు

కాటారం: వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో కాటారం ఏడీఈ నాగరాజు సూచించారు. విద్యుత్ ప్రమాదాల నివారణలో భాగంగా మండలంలోని చిద్నెపల్లిలో గురువారం విద్యుత్ శాఖ–పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ ప్రమాదాల సంభవించే తీరు, నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గూర్చి ప్రజలకు వివరించారు. వర్షాకాలంలో విద్యుత్ తీగలు తెగిపడిన, ఇంట్లో విద్యుత్ సమస్యలు ఏర్పడిన వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. సొంతగా ఎలాంటి మరమ్మతులు చేపట్టొద్దని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఈ ఉపేందర్, లైన్‌మెన్ చంద్రమౌళి, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లి సబ్ సెంటర్ సందర్శన



వైద్య సిబ్బందితో సెంట్రల్ టీం సభ్యులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బ్రాహ్మణపల్లి సబ్ సెంటర్‌ను నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ సర్టిఫికెట్ గుర్తింపు కోసం సెంట్రల్ టీం మెంబర్స్ రమణి, గంగాదర్ గురువారం సందర్శించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఎన్‌సీవీబీడీసీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఉమాదేవి, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సందీప్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ చిరంజీవి, కాళేశ్వరం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుస్మిత, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హిమబిందు, డీడీఎం మధు సమక్షంలో వైద్య ప్రమాణాల గురించి ప్రత్యేకంగా పరిశీలించి, వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమములో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు మమత, గీత, జ్యోతి, ఆస్మా, వైద్య సిబ్బంది అమర్, నీరజ, సమ్మురాజరమణయ్య, శ్రీనివాస్, రమేష్ వెంకటేష్, హేమలత, వెంకటమ్మ,పుష్ప శ్రీలత, రుద్ర, మాదవి, మల్లేశ్వరి, ప్రేమలత, హుమానిల్, మక్బూల్ తదితరులు పాల్గొన్నారు.

13న చలో హైదరాబాద్



పెన్షన్‌దారులతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మల్హర్: చేయూత పెన్షన్‌దారుల పింఛన్ పెంపునకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 13న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ దుమ్ము వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి, మండల అధ్యక్షుడు కేసారపు నరేశ్ అన్నారు. మంద కృష్ణ ఆదేశాల మేరకు మండలంలోని తాడిచర్ల, మల్లారం గ్రామాల్లో గురువారం పెన్షన్‌దారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వద్దులకు, వితంతువులకు, దివ్యాంగులకు పింఛన్ పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం శంకరన్న, మండల అధ్యక్షుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి కేసారపు నరేశ్, కాటారం మండల అధ్యక్షుడు మంతెన చిరంజీవి, మండల ప్రధాన కార్యదర్శి తాండ్ర దినేశ్, మధుకర్, లక్ష్మయ్య, సందీప్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు

జిల్లా వ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలు అంగన్‌వాడీ కేంద్రాల్లో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బంది గురువారం ర్యాలీ నిర్వహించి తల్లిపాలపై గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమన్నారు. పిల్లలు పుట్టిన వెంటనే గంటలోపు ముర్రుపాలు పట్టించాలని సూచించారు. చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు.

\- సాక్షి నెట్‌వర్క్



మల్హర్: అన్నప్రాసన నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



భూపాలపల్లి రూరల్: తల్లి పాల వారోత్సవాల్లో పాల్గొన్న అధికారులు



కాటారం: అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మౌనిక



మొగుళ్లపల్లి: మాట్లాడుతున్న మండల స్పెషల్ ఆఫీసర్ మానస

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి



రేగొండ: డిక్షనరీలు అందజేస్తున్న కృష్ణకుమారి



కాటారం: మెమొంటో అందజేస్తున్న ఎంఈఓ శ్రీదేవి

రేగొండ: విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని గంగిశెట్టి ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి అన్నారు. మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన 12 మంది విద్యార్థులకు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గంగిశెట్టి మధురమ్మ ట్రస్ట్ మెమోరియల్ నిర్వహకుడు గంగిశెట్టి జగదీశ్వర్ డిక్షనరీలు, షీల్డులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ.. తల్లిదండ్రుల ఆకాంక్షకు అనుగుణంగా విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్ తాటి నరేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

కాటారం: కాటారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో 2024–25లో పదో తరగతి చదివి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను గంగిశెట్టి మధురమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక జెడ్పీహెచ్ పాఠశాలలో ట్రస్ట్ నిర్వాహకులు సన్మానించారు. ఆయా పాఠశాలల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను శాలువాతో సన్మానించి మెమొంటో, డిక్షనరీలు అందజేశారు. ఎంఈఓ శ్రీదేవి, ప్రధానోపాధ్యాయుడు సమ్మయ్య, ఉపాధ్యాయులు గండు రాజబాబు, శ్రీనివాస్, పవన్, ప్రతాప్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ గద్దల సుదర్శన్, ట్రస్టు సభ్యులు సురేశ్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

భారీ వర్షం

కాళేశ్వరం: మహదేవపూర్, కాళేశ్వరం తదతర ప్రాంతాల్లో గంటపాటు భారీ వర్షం కురిసింది. గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. దీంతో విద్యుత్ వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు.

నోట్‌బుక్స్ పంపిణీ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు హైదరాబాద్ హెల్పింగ్ సొసైటీ ఫౌండేషన్ వారు నోట్‌బుక్స్ అందజేశారు. కాగా, గురువారం మాజీ జెడ్పీటీసీ గుడాల అరుణశ్రీనివాస్ విద్యార్థులకు పంపిణీ చేశారు.

కాటారంలో..

కాటారం: మండలంలోని చిద్నెపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, నేతకాని మహార్ విద్యార్థి విభాగం హైదరాబాద్ ఇన్‌చార్జ్ బీరెల్లి రజనీకుమార్ పుట్టిన రోజును పురస్కరించుకొని జీపీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కాంగ్రెస్ నాయకులు నోట్‌బుక్స్, పరీక్షా ప్యాడ్లు, సామాగ్రి అందజేశారు. మాజీ ఎంపీటీసీ మహేశ్ రవీందర్‌రావు, మాజీ సర్పంచ్ గొడిశెల రాజిరెడ్డి, అంగడి వెంకటేశ్వర్లు ఉన్నారు.

మత్తుకు బానిస కావొద్దు

గోవిందరావుపేట: యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ అన్నారు. మండల వ్యాప్తంగా ప్రధాన కూడలిలో, షాపులల్లో, రహదారిపై వాహనాల్లో నార్కోటిక్ స్నైపర్ డాగ్‌తో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత యువత మత్తుకు బానిసై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు సరఫరా చేస్తున్న వ్యక్తుల సమాచారం తెలిస్తే పోలీసులకు తెలుపాలన్నారు.

తపాలా జీవిత బీమా చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న హనుమంతు

చిట్యాల: మండలంలోని అందుకుతండా గ్రామానికి చెందిన అజ్మీరా రమేశ్ ఇటీవల మృతి చెందాడు. దీంతో మృతుడికి తపాలా పోస్టఫీస్ ద్వారా రూ.2,09600 జీవిత బీమా చెక్కు మంజూరైంది. దీంతో రమేశ్ కుటుంబ సభ్యులకు చెక్కును గురువారం హనుమకొండ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీస్ హనుమంతు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవిత బీమా కలిగి ఉండడం వలన కలిగే ప్రయోజనాలను గ్రామస్తులకు వివరించారు. 18 సంవత్సరాలు కలిగిన ప్రతి ఒక్కరూ జీవిత బీమాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు

- జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బాలకృష్ణ



ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

కాటారం: ఉపాధిహామీ పథకంలో భాగంగా నిర్వహిస్తున్న పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బాలకృష్ణ హెచ్చరించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా 1 ఏప్రిల్ 2024 నుంచి 31 మార్చి 2025 వరకు మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన రూ.4,09,61,996 వ్యయం పనులపై గత పది రోజులుగా సామాజిక తనిఖీ బృందాలు తనిఖీలు చేపట్టి నివేదికలు తయారు చేశారు. 24 గ్రామపంచాయితీలకు సంబంధించిన పనుల వివరాలు, అవకతవకలను తనిఖీ బృందాల డీఆర్పీలు సమావేశంలో వెల్లడించారు. రూ.80814 అవకతవకలు జరిగినట్లు గుర్తించిన విజిలెన్స్ అధికారులు బాధ్యులైన ఉపాధిహామీ అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు జరిమానా విధించారు. అనంతరం నూతనంగా నియమితులైన మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమలసమ్మయ్య, ఉపాధిహామీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ దండ్రు రమేశ్‌ను అధికారులు, సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారిణి రూబినాబేగం, అంబుడ్స్‌మెన్ శ్రీనివాస్, క్వాలిటీ కంట్రోలర్ ధరమ్‌సింగ్, ఎంపీడీఓ బాబు, ఎస్ఆర్‌పి కవిత, ఏపీఓ వెంకన్న, డీఆర్పీలు, టీఏలు పాల్గొన్నారు.

అదుపు తప్పి బ్రిడ్జి కింద పడిన కారు



కిందికి దూసుకెళ్లిన కారు

గణపురం : జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం గణపురం–ధర్మరావుపేట గ్రామాల మధ్య ఉన్న మోరంచ వాగు వద్ద ఘటన బుధవారం రాత్రి ఓ కారు అదుపు తప్పి బ్రిడ్జి కింద పడింది. భూపాలపల్లి కారల్ మార్క్స్ కాలనీకి చెందిన నరేందర్ గణపురం నుంచి భూపాలపల్లి వైపునకు వెళ్తుండగా రోడ్డుపైన ఉన్న గుంతను గమనించక అదుపు తప్పి బ్రిడ్జి కిందకు దూసుకెళ్లింది. ఈ సమయంలో నరేందర్ కారు నడుపుతున్నాడని, ఆయనకు ఎలాంటి ప్రమాదం జరగ లేదని పోలీసులు తెలిపారు.